# కొవ్వొత్తి

-డా॥ పోట్లూరి

తలగడ, దుప్పటి చెమటతో తడిచిపోయాయి. అటూ ఇటూ దొర్లు తున్నాడే తప్ప, రాముకి కంటిరెప్ప మూతపడడం లేదు. తల్లి విషయం తెలిసిన దగ్గర్నుంచీ మనిషిలో ఆందోళనా, అసహనం ముప్పిరిగొన్నాయి. కరెంటు కోత! రెండుగంటల వరకూ లైట్లు వెలగవు. కొవ్వొత్తి వెలిగించి, ఆ వెలుతురులో చెల్లెలి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం మళ్ళీ చదవసాగాడు.' జాలువారిన కన్నీరు పడి, స్పష్టత కోల్పోయిన అక్షరాలు. 'అమ్మకు జ్వరం తగ్గడం లేదు. బాగా నీరసించిపోయిందన్నయ్యా' ఈ వాక్యం అతని గుండెల్ని బ్రద్దలు కొడ్తోంది. మనసు కకావికలమైపోతోంది.

'అమ్మ' అందరికీ ఆరాధ్య దైవమే. తన పిల్లలు అందరికన్నా బాగుండాలన్న తపన ఒక రకంగా స్వార్థచింతనే కావచ్చు. ఆమెలో మెండుగా ఉంటుంది. తన శక్తియుక్తులన్నిటినీ పిల్లల బాగో గులకై వెచ్చిస్తుంది. ఇది సహజ లక్షణం. కానీ తన 'అమ్మ' అంతకుమించిన మహాతల్లి. నిజంగా దైవంతో సమానం. 'ఉన్నదాన్ని దాచుకోవద్దు. ఉన్నం తలో తోటివారికి తోడ్పడు. వాళ్ళకు మంచిని పంచు. మంచిని పెంచు. పంచినకొద్దీ ప్రేమ పెరు గుతుంది. అదే మనకు శ్రీరామరక్ష అవుతుంది'. ఎంతటి మహోన్నత సందేశం!

తనకు తెలిసినంత వరకు తన తల్లికి సుస్తీ చేయడం ఇదే తొలిసారి. కాని తన చిన్నతనంలో తన తల్లికి ప్రాణాపాయం తప్పి ఉంటుందని ఎవరో హస్త సాముద్రికుడు తన చేయిచూసి చెప్తే తను విశ్వసించలేదు. తర్వాతెప్పుడో ఇంటికి వెళ్ళినప్పుడు ఆ విషయమై తల్లినడిగితే ఆమె గతంలోకి కొన్ని క్షణాలు వెళ్ళిపోయింది. ఆమె నేత్రాంచలాల్లోంచి అశ్రువులు చెక్కిళ్ళపై నుంచి జాలువారుతుంటే, 'అవును బాబూ... ఆ రోజుల్లో మీ నాన్న పెట్టే బాధల్ని భరించలేక ఒకసారి, నువ్వు నాలుగు నెలల పసికందుగా ఉయ్యాలలో పడుకుని ఉండగా చనిపోవాలని ఉరి వేసుకున్నా. దూలాన్నుంచి వేలా డుతుండగా 'అమ్మా' అంటూ ఏడ్చేసరికి, మెడకు తగిలించుకున్న ఉరి ఎలా తప్పించుకోగల్గానో నాకే తెలీదు. మృత్యుగహ్వరాన్నుండి నువ్వే నన్ను బ్రతి కించుకున్నావు బాబూ...' చీరకొంగుతో కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది.

దూలం నుంచి ఉరి వేసుకుని వేలాడే దృశ్యం. ఆ రోజునే తన తల్లి చనిపోయి ఉంటే? తల్లి లేని బిడ్డగా తన బ్రతుకు రీతి ఎలా ఉండి ఉండేదో..? తల్లి ప్రేమకు నోచుకోని అభాగ్య జీవులెందరో! అలాకాక తల్లి పెంపకంలో పెరిగి పెద్దవాడైన తన జీవితం నిజంగా ధన్యం. ఇతరుల కష్టాన్ని చూచి, చేతనైన సాయం చేస్తుండే తన మాతృమూర్తి మహోన్నత లక్షణం– తను వారసత్వంగా పుణికి పుచ్చుకున్న సంపద. ఎందరు తనను బ్రదకడం చేతగానివాడని వ్యాఖ్యానించినా, లక్ష్యపెట్టేవాడు కాదు రాము. ఆ తల్లికి బిడ్డ కావడమే తన అదృష్టం.

తల్లిని అనారోగ్యాన్నుంచి రక్షించుకోవాలి. తమ వూళ్ళోట ఓ మిషనరీ హాస్పటలుంది. రోగుల్ని శ్రద్ధగా చూస్తారు. డాక్టరు వసుంధర... ఓ గొప్ప డాక్టరు. ఆమెను చూస్తేనే రోగుల వ్యాధులు మటుమాయమైపోతాయని చెప్పుకునేవారు.

మారునాడుదయమే బయలుదేరి స్వగ్రామం వెళ్ళాడు. తల్లి బాగా చిక్కి శల్యమైంది. కేవలం జ్వరమే కాదు, కాళ్ళ నొప్పులని బాధపడుతోంది. తండ్రిని ఒప్పించి తల్లినీ, చెల్లినీ తనవెంట తీసు కెళ్ళాడు. మిషనరీ హాస్పటలు కెళ్ళాడు. డాక్టరు వసుంధర నెలరోజులు సెలవుపై వెళ్ళిందట. హతా శుడయ్యాడు రాము. అయినా కెనడా నుంచి వచ్చిన డాక్టరు ఉన్నాడంటే ఆయనకు చూపించాడు తల్లిని. పరీక్ష చేసిన డాక్టరు బయటకొచ్చాడు. మనిషి ఆజానుబాహుడు. ఆయన్ని చూసేసరికి ఎంత సమర్థుడైన డాక్టరనిపించింది రాముకి. 'మిస్టర్ రామూ... సారీ టు టెల్ యూ, మీ అమ్మకు క్యాన్సరు. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఎక్కడికైనా తీసికెళ్ళి రేడియం థెరపీ ట్రీట్‌మెంట్ ఇప్పించండి. అయినా బ్రతికేది కొన్నాళ్ళే' అని ఘుజంతద్దూ చెప్పేసరికి, రాము తన ముందున్న ప్రపంచమంతా ఒక్కసారి చీకటైపోయినట్టయింది.

ధనికులకు రావలసిన జబ్బు. ఎంత నెచ్చించినా తల్లి బ్రతకడం కొన్నాళ్ళేనేమో. థెరపీ ట్రీట్‌మెం ట్‌కి ఏ మద్రాసో, రాయవెల్లూరో తీసుకెళ్ళవలసి ఉంటుంది. అందుకు చాలా ఖర్చవుతుంది. అంత డబ్బు ఖర్చు పెట్టగలిగిన స్థితి తనకు లేదు. అయినా తన తల్లిని తాను రక్షించుకోవాలి. తన దగ్గరున్న పదివేల రూపాయలూ బ్యాంకు లోంచి డ్రాచేసి తల్లిని, వైద్య సదుపాయలు ఆధునికమవుతున్న విజయవాడలో చూపించాలని బయలుదేరాడు. విజయవాడలో తన మేనమామ ప్రఖ్యాత ప్లీడరు. ఆయనతో తల్లి విషయం చర్చిం చాడు. 'ఇటలీ నుంచి ఇటీవలే వచ్చి హాస్పిటలు పెట్టిన డాక్టరు చక్రవర్తి బాగా చేస్తున్నాడంటున్నారు. ఆయనకు చూపించుదాం' అన్నారాయన.

డాక్టరు చక్రవర్తి పరీక్ష చేస్తున్నారు. ఈయనేమం టారో? అనురానుమంటోంది మనస్సు. డాక్టరు బయటకొచ్చి 'క్యాన్సరు కాదు' అని చెప్పేసరికి 'హమ్మయ్య' అనుకున్నాడు. ఎంత మంచి డాక్టరు! ఎంత చల్లని మాట చెప్పాడు! మనసు ఆనంద డోలికల్లో ఓలలాడింది. ఎంతో రిలీఫ్ ఫీలయ్యాడు. కొండంత బరువు దిగిపోయినట్లయి ఘనాసెంతో తేలికపడింది రాముకి, వాళ్ళ చెల్లెలికి.



గ్రౌండ్ ఫ్లోరులో హాస్పిటలు. ఫస్టు ఫ్లోరు 'హెచ్' షేపులో రెండు వరుసల్లో ఇన్‌పేషెంట్లకు పాతిక గదుల వరకు ఉన్నాయి. చిన్నచిన్న గదులైనా పరిశుభ్రంగా ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పేషెంట్ల తాలూకు మనుషులంతా మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశంలో కూర్చొని కబుర్లాడుకుంటుంటారు. అదొక సత్రంలా కొత్త పేషెంట్లు వస్తుంటే పాత పేషెంట్లు వెళ్లిపోతుంటారు. రకరకాల పేషెంట్లు. ఒక కులంవారు కాదు, ఒక మతంవారు కాదు. అదొక జాతీయ ప్రవంతిలా ఉంది. తరతమ భేదాన్ని మరచిపోయి ఒకర్ని చూచి మరొకరు దరహాసంతో పలకరించుకునే వాతావరణం.

ఆ వాతావరణం రాముా తల్లికి కొంత ఊరటనిచ్చింది. డాక్టరు చిరునవ్వుతో మాట్లాడుతుండడం నర్సులు ఆత్మీయుతుల్లా వ్యవహరించడం రాము తల్లికి కాస్త ఉపశమనం అనిపించాయి. రాము, అతని చెల్లి సేవ చేయడంలో నిద్రాహారాలు మరిచిపోయారు.

ఆ రోజు ఉగాది. ఇంటి దగ్గరుంటే పండగ చేసుకునే పని అని ఆ క్రితం సాయంత్రం హాస్పిటల్‌లో ఉండవలసి వచ్చినందుకు బాధపడింది. తల్లి మనసులో బాధను తుడిచెయ్యాలనిపించింది అన్నాచెల్లెళ్లకు. హాస్పిటల్లోనే ఉగాది చెయ్యాలనుకున్నారు.

ప్రొద్దునే తల్లికి తలంటు స్నానం చేయించింది. కొత్త చీర కట్టింది. నుదుట చిన్న కుంకుడుకాయంత కుంకుమ బొట్టు పెట్టింది. అచ్చం లక్ష్మీదేవికి ప్రతిరూపం అనిపించేలా ఉంది ఆ తల్లి. ఆ ఇరుగు పొరుగువాళ్లు బంధువులు ఆ తల్లిలో ఉట్టిపడుతున్న జీవకళకు ముగ్ధులయ్యారు. వాళ్లందరూ ఆనంద పరవశులవుతూంటే రాము, అతని చెల్లెలు ఎంతో సంబరపడిపోయారు.



డాక్టరు చక్రవర్తి రౌండ్సుకు వచ్చాడు. ఆమె అలంకరణకు, ఆమె ప్రస్ఫుటమవుతున్న తేజస్సుకు ముసిముసిగా నవ్వుతూ 'ఏమ్మా తెలిగ్గా ఉందిగా, ఇక తగ్గిపోతుందిలే' అంటూ పరీక్ష చేసి మందులు రాసిచ్చాడు. మందులు కొనుక్కొద్దామని బజారుకు వెళ్ళాడు రాము. వాళ్ళ ఊరు వాళ్ళు బజార్లో కలిశారు. 'ఎలాగూ చనిపోయే తల్లికి డబ్బులు ఖర్చుపెట్టి వృధా చేస్తున్నాడు. ఆ డబ్బు చెల్లెలు పెళ్ళికి ఉపయోగపడతాయి కదా. ఎవరి మాటా వినడు. తనకు పట్టిన పిచ్చే తనకు ఆనందం' అని బంధువులు వ్యాఖ్యానించినట్టు తెలిసి చాలా బాధపడ్డాడు రాము. తన తల్లి ఉన్న స్థితిలో తనకు బాసటగా నిలబడవలసిన బంధువులు తనకేరకంగానూ ఆసరా ఇవ్వకపోగా, తన తల్లికి వైద్యం అనవసరమని వ్యాఖ్యానించడాన్ని అతను భరించలేకపోయాడు. తన తల్లి విలువ తనకు తెలుసు. ప్రపంచంలో ఏది కోల్పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కాని తల్లిని సంపాదించుకోవడం మాత్రం అసాధ్యం. కనుకనే కన్నతల్లినెలాగైనా రక్షించుకోవాలన్నది రాము తపన!

మందులు కొని రాము హాస్పటలుకు తిరిగొచ్చేసరికి కాస్త టైమయింది. తల్లి దగ్గరకొచ్చే సరికి, తల్లి ముఖ కవళికల్లో బాధ కన్పిస్తోంది. చెల్లి తల్లికాళ్ళు నొక్కుతోంది.

'ఏమ్మా? బాగా బాధగా ఉందా? ఇదిగో ఈ బిళ్ళలు వేసుకోమ్మా?' అంటూ ఓ గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి తల్లికిచ్చాడు. తల్లి మందుబిళ్ళలు వేసుకోడానికి తటపటాయిస్తోందనిపించింది. 'అమ్మా.. తగ్గిపోతుందమ్మా.. డాక్టరుగారు కూడా నీతోనే చెప్పారుగా' అని తల్లికి విశ్వాసాన్ని నూరిపోశారు.

తల్లి బిళ్ళలు వేసుకొంది. ఆమె కనుకొలకుల్లో అశ్రువులు పొటమరించాయి. అది చూసేసరికి రాము మనసు కలత చెందింది. 'అమ్మా. అధైర్య పడకమ్మా. నీకు తగ్గిపోతుందమ్మా' గాద్గదికంగా అన్నాడు రాము.

తల్లి చూపు గుమ్మంలోనుంచి వరండాలో స్తంభానికి ఆనుకొని నిర్జీవ ప్రతిమలా కూర్చొని ఉన్న ఓ పాతికేళ్ళ స్త్రీని చూస్తోంది. ఆమె ఒడిలో ఓ పసిపాప, ప్రక్కనే మూడు సంవత్సరాల బాలుడు ఆమెను అంటిపెట్టుకుని తల్లి ముఖంలోకి దీనంగా చూస్తూ తల్లి కళ్ళవెంట కారే కన్నీటిని తుడుస్తున్నాడు. తల్లి కన్నీళ్ళు తుడిచే బిడ్డ– ఆ దృశ్యం రామునెంతో ఆశ్చర్యపరిచింది. తను తల్లిపట్ల చూపించే ప్రేమ, ఆ పసివాడు తన తల్లి పట్ల చూపించే ప్రేమ తల్లీబిడ్డల మధ్య పెనవేసుకునే ప్రేమ అమరం!

'చూడు బాబూ... ఆ అమ్మాయి భర్తది ప్రమాద స్థితి. వెంటనే ఆపరేషను చేస్తేగాని జీవించడట. ఆపరేషనుకు అయిదువేలవుతుందట. పాపం ఆ అమ్మాయి పేదరాలు. చేతిలో అయిదొందలలే ఉన్నాయట. తనూ తన పిల్లలూ, తల్లిని వెంటబెట్టుకుని భర్తను ఈ హాస్పిటలుకు తీసుకొచ్చింది. ఆపరేషన్లు ఈ డాక్టరుగారు బాగా చేస్తారని ఎవరో చెప్తే వచ్చింది. పాపం డబ్బులేక, భర్తను దక్కించుకోలేనని ఎంతగానో ఏడుస్తోంది. ఏదైనా సాయంచేసి, ఇంకెవరితోనైనా కలిసి ఆమె పెనిమిటికి ఆపరేషను చేయించి, అతన్ని బ్రతికించి, ఆమె పసుపు కుంకుమలు నిలబెట్టించు బాబూ..' అంటూ బాధాతప్త హృదయంతో తల్లి చెప్పేసరికి రాము లిప్తపాటు నిర్వీణ్ణుడయ్యాడు. చావు బ్రతుకుల్లో ఉన్న తన తల్లి, తన బ్రతుకు గురించి కాక, ఎదుటి మనిషిని తప్పించాలన్న లక్షణం మహోన్నతం. తాను కాలుతూ, కరిగిపోతూ తన రూపం అదృశ్యమైపోతున్నా, లోకానికి వెలుగునిచ్చే కొవ్వొత్తి. తన తల్లీ అంతే.

రాము వెంటనే క్రిందకు వెళ్ళి డాక్టరు చక్రవర్తిగారితో మాట్లాడారు. మధిర నుంచి వచ్చిన ఆ పేదరాలి పెనిమిటికి ఆపరేషను చేసేందుకు అర్థించాడు. ఆపరేషను ఖర్చు తాను భరిస్తానని చెప్పాడు. ఆపరేషను జరిగింది. ఆపరేషన్ సక్సెస్ అయింది. గొప్ప డాక్టరుగా డాక్టరు చక్రవర్తిని అందరూ కొనియాడారు.

'బాబూ ఆజన్మాంతం నేను, నా పిల్లలు, నా భర్త మీకు ఋణపడి ఉంటాము. మీ ఋణం ఎలా... ఏ నాటికైనా తీర్చుకోగలుగుతామో లేదో?' అంటూ ఆ పేదరాలు రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ రాము కాళ్ళమీద పడబోయింది.

'అమ్మా ఇది నీ అదృష్టం. నీ పిల్లల అదృష్టం. ఈ సంఘటనకు నేను నిమిత్త మాత్రుణ్ణి. అదిగో మంచం మీద చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న మా అమ్మ కారణం. మంచిని పెంచి, పంచే మనసున్న మా అమ్మ ప్రేమ దృక్పథం మీ ఆయన్ని బ్రతికించింది' అన్నాడు రాము.

ఆ పేదరాలు మంచం దగ్గరకు వెళ్ళి రాము తల్లి రెండు కాళ్ళూ పట్టుకుంది. 'మాకు దేవతవు తల్లీ మా ఆరాధ్యదైవానివమ్మా'. తన కన్నీళ్ళతో రాము తల్లి పాదాలు తడిపింది.

రాము తల్లిలో ఏదో అవ్యక్తానందం ప్రస్ఫుటమయింది. ఆమెలోని దైవత్వాన్ని, ప్రేమామృతాన్ని ఆ సన్నివేశం తెలిసిన వారంతా ఎంతగానో శ్లాఘించారు.

వారం రోజులు గడిచాయి. ఆ పేదరాలి పెనిమిటి క్రమంగా కోలుకుంటున్నాడు. రాము తల్లి పరిస్థితి మాత్రం రోజురోజుకీ కొవ్వొత్తి కరిగి పోతున్నట్టు దిగజారిపోసాగింది. ఒకరికి ఆరోగ్యం మెరుగుదల, మరొకరికి ఆరోగ్యంలో క్షీణత.

పేదరాలి పెనిమిటిని ఆ రోజు డిశ్చార్జి చేస్తున్నారు. అప్పుడే రాము తల్లి పరిస్థితి పూర్తిగా మారిపోయిందనీ, బ్రతకడం కష్టమనీ, ఇంటికి తీసుకెళ్ళిపోవలసిందిగా కాంపౌండరు ద్వారా రాముకు కబురు అందింది.

డిశ్చార్జి రెండు ధ్రువాలకూ జరిగిపోయింది. గదిలో మిణుకు మిణుకు మంటున్న కొవ్వొత్తి కాలిపోయింది.